ఉపాధ్యాయులు కావలెను..

- పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులు
- సరిపడే టీచర్లు లేక విద్యార్థుల ఇబ్బందులు

కాట్రేనికోన: శివారు ప్రాంత మండలం కావడంతో ఉపాధ్యాయులు అక్కడ పని చేసేందుకు మొఖం చాటేస్తున్నారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లేవారే గానీ వచ్చేవారు లేక లేకుండాపోతున్నారు. జిల్లాలో అత్యధిక శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న మండలం కాట్రేనికోన. ఈ మండలంలోని గ్రామాల్లో పాఠశాలల్లో గురువులు లేక చదువు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో 75 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 63, ప్రాథమికోన్నత పాఠశాల ఒకటి. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 298 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఆయా స్కూళ్లలో 138 మాత్రమే ఉన్నారు. ఇంకా 160 ఖాళీలు ఉన్నాయి.

మండలంలో ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఈ ఏడాది జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా రూపుదిద్దుకున్న చిర్రయానం, వేట్లపాలెం, బలుసుతిప్ప పాఠశాలలతో కలిపి 162 మంది టీచర్సు ఉండవలసి ఉంది. అయితే 46 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తుండడంతో 116 మంది టీచర్సు కావాల్సి ఉంది. ఖాళీలు ఉండగా జల్లగుంట, వేట్లపాలెం, పల్లంకుర్రు పెదపేట, దొంతికుర్రు, కొప్పిగుంట పాఠశాలలో ఎంటీఎస్ టీచర్సు 5 మంది పని చేయడంతో 111 మంది ఖాళీలు ఉన్నాయి.


పల్లం ప్రాథమిక పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులు

మండలంలో 8 జెడ్పీహెచ్ పాఠశాలలో 136 మంది పని చేయాల్సి ఉండగా 87 మంది మాత్రమే పని చేస్తుండడంతో 49 మంది టీచర్సు పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సింగిల్ టీచర్సు పని చేస్తున్న పాఠశాలలు 53 ఉన్నాయి. ఇద్దరు పని చేస్తున్న ఒకే పాఠశాల నుంచి ఇద్దరు టీచర్సు బదిలీపై వెళ్లితే డీఎస్సీ నోటిఫికేషన్‌లో కొత్త టీచర్సు వచ్చే వరకు ఒకరు పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు.

టీచర్ల నిర్లక్ష్యంతో తగ్గిన రోల్

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలుగా అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన గత ప్రభుత్వంలో తల్లిదండ్రులకు జగనన్నపై నమ్మకంతో పాఠశాలలకు తమ పిల్లలను పంపించేవారు. మండలంలో 2023–2024 విద్యా సంవత్సరంలో 67 ప్రాథమిక, పాథమికోన్నత పాఠశాలలో 3,389 మంది, 8 జెడ్పీహెచ్ పాఠశాలలో 2,204 మంది విద్యార్థులు ఉండేవారు.

2025–26లో ఎంపీపీ పాఠశాలలో 3,052 మంది, జెడ్పీహెచ్ పాఠశాలలో 1,810 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 731 మంది విద్యార్థులు తగ్గారు. గతంలో 90 మంది విద్యార్థులు ఉన్న పోర ఎంపీపీ పాఠశాల టీచర్సు అలసత్వంతో 25కు పరిమితమైనా క్లాసులకు వచ్చే విద్యార్థులు మాత్రం 10 మందిలోపే ఉంది. టీచర్సు సకాలంలో పాఠశాలకు రాకపోవడం, విద్యార్థుల చదువుపై దృష్టి సారించకపోవడంతో పిల్లల భవిష్యత్ ఏమైపోతుందోనని భయపడిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల నుంచి రావడం, సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా టీచర్సుపై ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

> **ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళ్లా**
>
> కాట్రేనికోన మండలంలోని పాఠశాలలోని ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలను డీఎస్సీ కౌన్సిలింగ్‌లో భర్తీ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి, ప్రజాప్రతి నిధుల దృష్టికి తీసుకుని వెళ్లాను. ఈ మెగా డీఎస్సీలో టీచర్సు కౌన్సిలింగ్ జరిగిన తర్వాత ఖాళీలను భర్తీ చేస్తాం.
>
> – ఎం వెంకట రమణ, కాట్రేనికోన ఎంఈఓ–2

పోలీస్ ఫిర్యాదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: పోలీసులు అన్యాయంగా వ్యవహరించినప్పుడు, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు నిరాకరించినప్పుడు, అక్రమంగా అరెస్టు చేసినప్పుడు పోలీసులపై ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకు సుప్రీం కోర్టు ఆదేశాల ఉన్నాయని పోలీస్, ఇతర బాధితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెర్ల శాస్త్రులు గురువారం అమలాపురంలో ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇందు కోసం ఉండే పోలీస్ ఫిర్యాదు కేంద్రాలను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంవత్సరం క్రితం అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కేంద్రాల వద్ద పోలీస్ కంప్లెయింట్ అథారిటీ చిరునామా, ఫోన్ నంబర్లు పెట్టమని డీజీపీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అవి ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తూ జిల్లా ఎస్పీకి తాను వినతిపత్రం పంపించానని శాస్త్రులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల కోసం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. అమలాపురం పట్టణంలో మెయిన్ రోడ్డు, సీతాపతిరావుపేట, మున్సిపల్ కాలనీ, మార్కెట్, హనుమాన్ రోడ్, నారాయణపేట,కే అగ్రహారం, బ్యాంక్ రోడ్డు, సూర్యనగర్, పోస్టల్ కాలనీ, వడ్డిగూడెం, హైస్కూల్ రోడ్, ఈదరపల్లి, ఇందుపల్లి, బండారులంక గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి తరలిరావాలి

ఉప్పుగుప్తం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను నిరసనగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అమలాపురం మండలం కామనగరువు గ్రామంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ వద్ద శుక్రవారం నిరసన జరగనుంది. ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు భారీగా తరలి రావాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీను తీసుకుని వస్తే, ఈ కూటమి ప్రభుత్వం కుట్రతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి భవిష్యత్‌లో డాక్టర్ కావాలనుకునే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ముమ్మిడివరం: జిల్లాలో మధ్యాహ్న భోజన పథక కార్మికులు, శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రతినెలా ఐదోతేదీ లోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ముమ్మిడివరంలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషాకు గురువారం వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న పథకం నిర్వాహకులకు పెండింగ్ వేతనాలు, కుకింగ్ చార్జీలు వెంటనే చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గుర్తింపు కార్డులు, 9, 10 తరగతుల పిల్లల వర్కర్స్‌కి ఆరోగ్య బీమా కల్పించాలని ప్రతి నెల 50 మంది విద్యార్థులకు ఒక ఆయాని నియమించాలని యూనిఫాం క్లీనింగ్ లిక్విడ్స్ నాణ్యమైనవి సరఫరా చేయాలని, డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథక యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.బేబీ సరోజినీ, టి.నాగ వరలక్ష్మి, జే.సత్యనారాయణ, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.కుసుమ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: ఉప్పంగల పంచాయతీలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శాకా శంకరుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో టెక్నీషియన్ సుబ్రహ్మణ్యం సుమారు వంద మందికిపైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్టు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని సర్పంచ్ శంకరుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.


మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై అవగాహన ర్యాలీ

ముమ్మిడివరం: అయినాపురంలో వీవో-3లో మనడబ్బులు-మన లెక్కలు యాప్‌పై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం రమణ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు గ్రామంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ వినియోగం వల్ల ప్రభుత్వ పథకాల కింద లభించే నిధులు, వాటి ఖర్చులు, వివరాలు పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈయాప్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీ సీసీలు,క్లస్టర్ ఇన్‌చార్జులు, వీఓలు, పాల్గొన్నారు.

నగర పంచాయతీలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

ముమ్మిడివరం: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కొండాలమ్మ చింత, బల్లగేటు సెంటర్లలో పారిశుద్ధ్య కార్యక్రమంతో చెత్తచెదారం వేయరాదని నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి, పొడి చెత్తను వేరుగా వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, ఏఈ కే.శ్రీనివాస్, టీపీఓ బి.రాజేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాంలో సమస్యలపై చర్చ



హోం మంత్రి నమశ్శివాయంతో ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గానికి సంబంధించి పలు అపరిష్కృత సమస్యలపై పుదుచ్చేరి హోమ్, విద్యాశాఖల మంత్రి నమశ్శివాయంతో చర్చించి వినతిపత్రాలు సమర్పించినట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా యానాంలో వివిధ పాఠశాలల్లో పారా టీచర్స్ నియామకం చేపట్టాలని, గెస్ట్ టీచర్లను పర్మినెంట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. శాంతిభద్రతల కోసం పోలీసుల సంఖ్యను పెంచాలని కోరినట్లు తెలిపారు. అన్ని సమస్యలను విన్న హోమ్‌మంత్రి తక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

కొబ్బరి చెట్ల తొలగింపుతో వివాదం

- అర్ధాంతరంగా నిలిచిన శివాలయం అభివృద్ధి పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: ఉప్పంగల గ్రామంలో ఉన్న పురాతన శివాలయం అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. సుమారు 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణాన్ని చప్టా చేసి అభివృద్ధి చేసేందుకు రూ.7 లక్షలు కేటాయించగా, ఆయా పనులకు ఒక వ్యక్తి రూ.4.10 లక్షలకే టెండర్ దక్కించుకుని పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న కొబ్బరి చెట్లను తొలగించారు. దీంతో వివాదం చెలరేగింది. గ్రామంలో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా కొబ్బరిచెట్లను తొలగించారని ఒక వర్గం చెపుతుండగా, ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకే చెట్లను తొలగించాల్సి వచ్చిందని మరో వర్గం వారు చెబుతున్నారు. చెట్ల తొలగింపుపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో ఈ నెల 12వ తేదీన దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.నాగేశ్వరరావు ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించారు. వారి వాదనలు విని కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని చెప్పి వెళ్లిపోయారు. అయితే ఈ ఘటన జరిగి వారం రోజులు పూర్తవుతున్నా పనులు పునఃప్రారంభించకపోవడంతో భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే కార్తికమాసంలో ఆలయ ప్రాంగణంలో భారీ స్థాయిలో మహా రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరుగనున్నాయని, ఆ సమయానికి పనులు పూర్తవుతాయని భావించామని భక్తులు చెపుతున్నారు. ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి శివాలయం అభివృద్ధి పనులను కార్తికమాసం నాటికి పూర్తిచేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.


ఉప్పంగల శివాలయంలో నిలిచిన అభివృద్ధి పనులు

మహిళల ఆరోగ్యమే కుటుంబ సంక్షేమం

ముమ్మిడివరం: ఆరోగ్యకమైన మహిళలు ఆ కుటంబానికి వెన్నుముకతో సమానమని ఎంపీపీ కోలా గంగా భవానీ తెలిపారు. గురువారం పళ్లవారిపాలెం సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన స్వస్థనారీ సశక్త్ పరివార్ కార్యక్రమం(మెడికల్ క్యాంపు)ను ఆమె ప్రారంభిచారు. వైద్య శిబిరంలో కొత్తలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ముకుందా, డా.పూజాశ్రీ. డా.రాగమంజరి, చోడపనీడి కల్యాణి, లు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దీక్షితులుచ, గ్రామ సర్పంచ్‌లు చిక్కం పద్మజా, చింతలపూడి ధన నాగమణి, శ్రీనివాస్, కొండబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఇంటిలో మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం అంతా ఆరోగ్యకరంగా ఉంటోందని కేశనకుర్రు పీహెచ్‌సీ అధికారి కె.రాజేష్ అన్నారు. మురమళ్ల గ్రామ సచివాలయంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కె.రాజబాబు దీనిని ప్రారంభించారు. మహిళలు, కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఎం.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్ ఒ.రమేష్, సీహెచ్‌వో శ్రీకర్, తేజ విశాలాక్ష్మిలు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను మహిళలు స్వదినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. ఇందుపల్లి గ్రామంలో డీఎండీహెచ్‌వో దుర్గారావు దొర, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ ఓ భారతలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ గురువారం ప్రారంభించారు. ఈ శిబిరంలో పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ల రమ్య శైలజ, రాహుల్ ఆడమ్స్ వైద్య పరీక్షలు చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొల్లంగి శివాలిని, ఎంపీటీసీ సభ్యులు కోరుమిల్లి రాంబాబు, ఉప సర్పంచ్ హనుమస్ బుజ్జి, సూపర్‌వైజర్ల , ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాళ్లరేవు: గాడిమొగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు ఈశ్వర్ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే పౌష్టికాహారం ఆవశ్యకతను మహిళలకు వివరించారు. ఎంపీహెచ్ఈఓ బీఎల్‌జీ కుమార్, హెచ్‌వీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ హేమంత్, ఏఎన్ఎంలు స్వాతి, పద్మ, వెంకటలక్ష్మి, లక్ష్మీకాంతం, వరలక్ష్మి హెల్త్ అసిస్టెంట్స్ ప్రసాద్, శ్రీను, బాలకృష్ణ, ఆంజనేయులు, ఆశా వర్కర్లు మేరీ రత్నం, భారతి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి మోదీ జన్మదినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వడ్డిగూడెం అర్బన్ హెల్త్ సెంటరులో నిర్వహించిన వైద్య శిబిరం 80మంది పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అర్బన్ హెల్త్ సెంటరు మెడికల్ ఆఫీసర్ డి.శిరీష, డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్


మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

అసెంబ్లీలో డీఎంకే, కాంగ్రెస్ సభ్యుల ధర్నా


యానాం: స్టేట్‌హుడ్, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు గురువారం నిర్వహించిన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం నుంచి డీఎంకే, కాంగ్రెస్ సభ్యులను స్పీకర్ సెల్వం సభ నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలిచ్చారు. సభ ప్రారంభం అయిన తర్వాత స్వతంత్ర శాసన సభ్యుడు జి.నెహ్రూ వివిధ సమస్యలపై మాట్లాడారు.ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత ఆర్.శివతో సహా మరో ఆరుగురు డీఎంకే సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు ఎం.వైద్యనాథన్‌తో సహా పలువురు కలుషిత తాగునీటి సరఫరాపై గట్టిగా మాట్లాడుతూ అసెంబ్లీ కాల వ్యవధిని పెంచాలని 10 రోజులు జరపాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో పలుమార్లు వారి స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ కోరినప్పటికీ వినిపించికోలేదు. నేలపై కూర్చుని ధర్నాకు దిగారు. దీంతో స్పీకర్ సెల్వం గార్డుల సహాయంతో వారిని బలవంతంగా బయటకు ఎత్తుకుని తీసుకువెళ్లారు. అనంతరం జీఎస్టీ సంస్కరణల బిల్లుపై చర్చించారు. ఈ సమావేశంలో సీఎం రంగసామి, హోమ్ మంత్రి నమశ్శివాయం, యానాం నియోజకవర్గ ప్రాతినిధ్య శాసనసభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

అమలాపురం రూరల్: భట్లపాలెంలో బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన హ్యాకథాన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. మెషీన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఎంఆర్ విద్యాసాగర్, నాగేంద్రలు విద్యార్థులకు మెషీన్ లెర్నింగ్ రంగంలో అనేక కీలకమైన అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీసీ రామారావు, ఈఈఈ విభాగాధిపతి రాజగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జక్కం కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి హ్యాకథాన్‌లలో పాల్గొనడం వల్ల పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

ప్రకృతి వ్యవసాయ సెంటర్ ప్రారంభం

ఐ.పోలవరం: తిళ్లకుప్ప గ్రామంలో ప్రకృతి వ్యవసాయ బయో ఇన్‌పుట్స్, అవుట్ పుట్ సెంటర్‌ను అడిషనల్ డీపీఎం ఎం.సత్యనారాయణ ప్రారంభించారు. హస్మిత బీఆర్‌సీ సెంటరు ప్రతినిధి యాళ్ల వెంకటకృష్ణ నాగ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. రైతు సాధికార సంస్థ ఆర్థిక సహాయంతో దీనిని ప్రారంభించారు. తిల్లాకుప్ప, పక్క గ్రామాలకు రైతులు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వాణి మాట్లాడుతూ రైతులు అందరూ బీఆర్‌సీ సెంటర్‌లో ఇన్పుట్ తీసుకుని వెళ్లి రసాయనాలు లేని పంటలు పండించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామ పీఎంటీసీ ఉండ్రు సత్యనారాయణ, సర్పంచ్ శీలం గోవిందు రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏడు కొండలు, దుర్గారావు, తిరుమల రావు, రాజేష్‌లు పాల్గొన్నారు.


బీఎంసీ సెంటరును ప్రారంభించిన అడిషనల్ డీపీఎం సత్యనారాయణ

అమలాపురంలో సేవా కార్యక్రమాలు

- రక్తదానం, అన్నదానం చేసిన అభిమానులు
- ప్రారంభించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజక వర్గాల పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక సూర్యనగర్‌లో గురువారం ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. పార్టీకి చెందిన 45 మంది యువకులు రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. స్థానిక లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. స్థానిక గోశాలలో గోవులకు దాణా వితరణగా అందించారు. పట్టణానికి చెందిన పార్టీ నాయకుడు గుమ్మళ్ల సురేష్ రాజోలులోని దివ్యాంగ పాఠశాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. జగ్గిరెడ్డితోపాటు ముమ్మిడివరం, రామచంద్రపురం, అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్లు పొన్నాడ సతీష్‌కుమార్, పిల్లి సూర్యప్రకాష్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర పార్టీ మహిళా విభాగం అధికార ప్రతినిధి కాశి మునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు పాల్గొని రక్తదానం చేసిన పార్టీ యువకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా పార్టీ శ్రేణుల సమక్షంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతో కేక్ కట్ చేయించారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, రామచంద్రపురం కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు


మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి


అమలాపురం రూరల్: మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకరమైన వ్యసనం మని విద్యార్థులు చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లకు దూరంగా ఉండాలని తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సూచించారు. కామనగరువులో అమలాపురం డిగ్రీ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు శరీరానికి హాని కలిగించే కొకేన్, హెరాయిన్ మొదలైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. తాలూకా ఏఎస్సై ఏడుకొండలు, డైరెక్టర్లు ఎం.రాంబాబు, ఎం.కిరణ్‌కుమార్, జీవీ ఎస్.నాయుడు, ఎం.సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

క్రీడా సౌకర్యాల కల్పనకు కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలో క్రికెట్ క్రీడాభివృద్ధికి, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోషియేషన్ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించి, కావాల్సిన సౌకర్యాలు గురించి చర్చించారు. ముందుగా క్రికెట్ మైదానం చుట్టూ 30 అడుగుల ఎత్తు మెష్ ఏర్పాటు, వర్షం నీరు నిల్వ లేకుండా డ్రెయినేజీ సదుపాయం, టార్ఫ్ పిచ్, టెన్నిస్‌బాల్ పిచ్ నిర్మాణం తదితర సౌకర్యాల గుర్పించి చర్చించారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు


ముమ్మిడివరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియ జేస్తున్న వీఆర్‌ఏలు

అమలాపురం రూరల్: రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని అమలాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి వీఆర్‌ఓ అటెండర్, వాచ్‌మెన్‌లుగా ప్రమోషన్లు కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, కార్యదర్శి ఎల్ విజయ, ఉపాధ్యక్షుడు ప్రశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏలు గురువారం ధర్నా నిర్వహించారు. వీఆర్‌ఏలు ప్రధాన సమస్యలైన పే స్కేలు, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్, కారుణ్య నియామకాలు నేటికి పరిష్కారం కాలేదని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న అమలాపురం ఆర్డీవో ఆఫీసు కార్యాలయం వద్ద, 22వ తేదీన కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘ మండల అధ్యక్షుడు ఉందుర్తి అంజలరావు, కార్యదర్శి జల్లి రామ్‌జీ, నేదునూరి పట్టాభిరామయ్య, నాగులపల్లి నాగేశ్వరరావు, కేశిరెడ్డి సత్యనారాయణ, దొనిపాటి రెడ్డి, కాశి మంగాదేవి, కోటిపల్లి కుమారి పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పేస్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన వారిని ప్రమోషన్ ఇచ్చి కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: వీఆర్‌ఏల యూనియన్ అధ్యక్షుడు మోకా సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు నిరసన చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 20న ఆర్డీఓ కార్యాలయం, 22న జిల్లా కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మాకే శ్రీను, అల్లవరపు పల్లంరాజు, వాసర్ల సత్యనారాయణ, వాడపర్తి దుర్గారావు, కాశి సంతోష్‌కుమార్, దొడ్డవరపు శ్రీదేవి తదితరులు గ్రామ సహాయకులు పాల్గొన్నారు.